ఈనాడు
ములుగు
మంగళవారం అక్టోబరు 1, 2024

గంజాయి విక్రయిస్తే రౌడీ షీట్ తెరవండి

ములుగు టౌన్, న్యూస్‌టుడే: సమస్యలతో పోలీసు స్టేషన్‌కు వచ్చే వారికి న్యాయం జరిగేలా దర్యాప్తు ముమ్మరం చేయాలని జిల్లా పోలీస్ అధికారి శబరీష్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో సోమవారం నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. సెప్టెంబరు నెలలో నమోదైన కేసుల వివరాలను ఆయా మండలాల ఎస్సైలను అడిగి తెలుసుకున్నారు. పోగొట్టుకున్న చరవాణులను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మరింత రికవరీ చేయాలని సూచించారు. జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో కూడా సీసీ టీవీలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎటువంటి నేరం జరిగినా.. క్షణాల్లో నేరస్థులను పట్టుకోవచ్చని వివరించారు. ప్రజావాణిలో, గ్రామ సభల్లో పోలీసు శాఖకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విని పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గంజాయి విక్రయం, తరలింపుపై నిఘా పెంచాలని, అమ్మినవారిపై రౌడీ షీట్ తెరవాలని పేర్కొన్నారు. ఠాణాలకొచ్చే వారిపై మర్యాదగా వ్యవహరించాలని, స్టేషన్‌కొస్తే సమస్య పరిష్కారమవుతుందనే భరోసా పోలీసు అధికారులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఓఎస్డీ మహేష్ బాబా సాహెబ్, అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీలు రవీందర్, రాములు, ములుగు, పస్రా, ఏటూరునాగారం సీఐలు శంకర్, రవీందర్, శ్రీనివాస్, ఆయా మండలాల ఎస్సైలు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..!



బొగత జలపాతంలో సోమవారం పర్యాటకులు సందడి చేశారు. నీటికొలనులో కుటుంబసమేతంగా ఈదుతూ.. సరదాగా గడిపారు. గలగల పారుతున్న జలపాతం వరదనీటిలో కేరింతలు కొడుతూ.. స్నానాలు చేశారు. రాతికట్టపై నుంచి జలపాతం నీటిధారలను తిలకించారు. చరవాణిలో స్వీయచిత్రాలు తీసుకుంటూ.. సాయంత్రం వరకు బొగత పరిసర ప్రాంతాల్లో సేదతీరారు. **- న్యూస్‌టుడే, వాజేడు(ములుగు జిల్లా)**

రక్తహీనతపై దృష్టి సారించాలి



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు, న్యూస్‌టుడే: జిల్లా వైద్యశాఖకు సంబంధించిన అనిమియా ముక్త తెలంగాణ గోడ పత్రికలను సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పాలనాధికారి టీఎస్.దివాకర ఆవిష్కరించి మాట్లాడారు. ఒకటి నుంచి 19 ఏళ్ల వయసు కలిగిన పిల్లలలో రక్తహీనతను తగ్గించే బాధ్యతను వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ ప్రభుత్వ శాఖలు, విద్యాశాఖపై ఉందని తెలిపారు. ఈ ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా పని చేసి పిల్లలను ఆరోగ్యవంతులుగా తయారు చేయాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి ఎ. అప్పయ్య, ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రణధీర్, జిల్లా సంక్షేమాధికారి శిరీష, జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి చంద్రకళ, డిప్యూటీ మాస్ మీడియా అధికారి సంపత్, సామాజిక ఆరోగ్య అధికారి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు



సూచనలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

ములుగు, న్యూస్‌టుడే: అక్టోబర్ 3 నుంచి 9 వరకు జిల్లాలో జరగనున్న ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్. మహేందర్‌జీ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన విద్యాశాఖ, సంబంధిత అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ములుగు మండలం బండారుపల్లి మోడల్ స్కూలులో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు వివరించారు. పదో తరగతికి సంబంధించి 129 మంది, ఇంటర్మీడియట్‌లో 106 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. కేంద్రం వద్ద మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. దగ్గరలోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలని, ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులను పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు ఆర్టీసీ బస్సులు సిద్ధంగా ఉంచాలని, 9 గంటల్లోగా కేంద్రానికి చేరుకోవాలన్నారు. హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, కేంద్రంలోనికి ఎలక్ట్రానిక్ వస్తువులు నిషేధమన్నారు. ప్రశాంతంగా పరీక్షలు జరిగేలా రెవెన్యూ, విద్య, వైద్య, పోలీసు శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

ములుగు: ములుగు మండలం రామచెంద్రాపురం గ్రామానికి చెందిన భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ తెలిపారు. ములుగులో గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారానికి గతంలో దరఖాస్తులు స్వీకరించి కంప్యూటరీకరణ చేసినట్లు వివరించారు. దరఖాస్తు చేయని రైతుల భూ సమస్యలను గుర్తించుటకు పంచాయతీ కార్యాలయాల వద్ద అర్జీలను స్వీకరించాలన్నారు. అక్టోబర్ 1 నుంచి 3 వరకు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక సిద్ధం చేస్తారన్నారు. దశల వారీగా సమస్యలను పరిశీలించి భూమిపై హక్కులను కల్పించుటకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కష్టేఫలి..!



డీఎస్సీలో మెరిశారు.. అనుకున్నది సాధించారు!

'డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన మంగళవారం నుంచి ఉంటుంది. సరైన ధ్రువపత్రాలతో హాజరుకావాలి. పూర్తి వివరాలకు డీఈవో కార్యాలయంలో సంప్రదించాలి'

న్యూస్‌టుడే యంత్రాంగం

కల నెరవేరింది.. కష్టానికి ఫలితం దక్కింది. డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎన్నో ఏళ్లుగా వీరు ఎదురుచూశారు. ఇతర అవకాశాలు ఉన్నా కాదనుకున్నారు. ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడంతో దీక్షగా చదివి చివరికి అనుకున్నది సాధించారు. ప్రభుత్వం సోమవారం వెల్లడించిన డీఎస్సీ ఫలితాల్లో సబ్జెక్టుల వారీగా జిల్లాల్లో మొదటి, రెండో ర్యాంకులు సాధించినవారి స్ఫూర్తిదాయక కథనం..



రాజశేఖర్

కొత్తగూడ మండలం కుందనపల్లికి చెందిన మద్దెల లక్ష్మీనారాయణ, సుభద్రల కుమారుడు రాజశేఖర్ లాంగ్వేజ్ పండిట్ హిందీ సబ్జెక్టులో 65.53మార్కులు సాధించిన జిల్లా ప్రథమ స్థానంలో నిలిచారు. పేదింటి ఆదివాసీ కుటుంబానికి చెందిన రాజేశేఖర్ గురుకులంలో కాంట్రాక్టు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ గతేడాది ప్రకటించిన గురుకుల ఉపాధ్యాయుల ఉద్యోగాల్లో ఎంపికయ్యాడు. ప్రస్తుతం వరంగల్ జిల్లా గిర్నిబావిలోని ఎంజేపీఎస్ గురుకులంలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్నారు. – కొత్తగూడ



నిడిగంటి సునీల్

మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామానికి చెందిన నిడిగంటి సునీల్ స్కూల్ అసిస్టెంట్ భౌతికశాస్త్రంలో 77.83 మార్కులు సాధించి మహబూబాబాద్ జిల్లా ప్రథమ ర్యాంకు సాధించారు. సునీల్ ప్రస్తుతం మహాత్మా జ్యోతిబా పులే సంక్షేమ గురుకుల పాఠశాలలో భౌతికశాస్త్రం బోధిస్తున్నాడు. – ఇనుగుర్తి

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని దుబ్బతండాకు చెందిన గుగులోతు నిఖిల్ స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్ విభాగంలో జిల్లా ప్రథమర్యాంక్ సాధించారు. ప్రస్తుతం పెద్దవంగర మహాత్మాజ్యోతిబాపులే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. – తొర్రూరు

ఒకేసారి మూడు ఉద్యోగాలు..



మామిడి మహేశ్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని గిద్దెముత్తారం గ్రామానికి చెందిన మామిడి మహేశ్ మూడు ఉద్యోగాలు సాధించి మురిపించారు. తెలుగు పండిట్ విభాగంలో 80.90 మార్కులతో జిల్లా మొదటి ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 76.40 మార్కులతో జిల్లా మూడో ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ సోషల్‌లో 73.40 మార్కులతో జిల్లా ఐదో ర్యాంకు సాధించారు. మహేశ్ ప్రస్తుతం ప్రభుత్వ గురుకుల టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తండ్రి సమ్మయ్య, కుటుంబ సభ్యులు, గురువుల ప్రోత్సాహంతో మంచి ఫలితం సాధించేందుకు కారణమైందని ఆయన చెప్పారు. – చిట్యాల

పీడీ, పీఈటీ సైతం..



నేతుల రాజు

వరంగల్ జిల్లా సంగెం మండలం మొండ్రాయికి చెందిన నేతుల రాజు డీఎస్సీలో ప్రథమ ర్యాంకు సాధించి ఫిజికల్ డైరెక్టర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. – సంగెం

దంపతులు సాధించారు



నాగలక్ష్మి, వినయ్ దంపతులు

వరంగల్ జిల్లా నల్లబెల్లికి చెందిన కొండ్లె నాగలక్ష్మి, వినయ్ దంపతులు డీఎస్సీలో ప్రతిభ చాటారు. వినయ్ జిల్లాస్థాయిలో ఏడో ర్యాంకు, నాగలక్ష్మి 54వ ర్యాంకు సాధించారు.



ప్రవలిక

☛ నల్లబెల్లికి చెందిన మూటికె ప్రవళిక 83.20 మార్కులతో జిల్లాస్థాయిలో రెండో ర్యాంకు సాధించి సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టుకు ఎంపికయ్యారు. రాజిత, రాజులు ఆమె తల్లిదండ్రులు. వారిది వ్యవసాయ కుటుంబం. – నల్లబెల్లి



అరుణ్‌కుమార్

ములుగు మండలం అబ్బాపురం గ్రామానికి చెందిన మోటపోతుల అరుణ్‌కుమార్ ఎస్జీటీ జనరల్ కేటగిరీలో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించారు. తండ్రి ఆనంద్ డీఎస్సీ పరీక్షకు ముందు అనారోగ్యంతో మృతి చెందినా.. మొక్కవోని దీక్షతో పట్టుదలతో చదివి ర్యాంకు సాధించారు. **- ములుగు**

ఎస్జీటీలో ప్రథమ ర్యాంకు



జన్నె రాగసుధ

భూపాలపల్లి జిల్లా టేకుమట్లకు చెందిన జన్నె రాగసుధ ఎస్జీటీ విభాగంలోమొదటి స్థానంలో నిలిచారు. స్వగ్రామం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట. టేకుమట్ల మండలం అంకుషాపూర్‌లోని అమ్మమ్మ ఇంటి వద్ద చదువుకున్నారు. **- టేకుమట్ల**



ఆకుల సంతోష్

● ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం సోమలగడ్డ మారుమూల గ్రామానికి చెందిన ఆకుల సంతోష్ హిందీ భాషా పండిట్ విభాగంలో మొదటి ర్యాంకులో నిలిచాడు. ప్రణాళికాబద్ధంగా చదివి లక్ష్యాన్ని చేరుకున్నాడు. **- గోవిందరావుపేట**



శ్రీరామ సుమన్

● ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు గ్రామానికి చెందిన శ్రీరామ సుమన్ ఫిజికల్ సైన్సులో మొదటి, గణితశాస్త్రంలో నాలుగో ర్యాంకర్‌గా నిలిచారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ చేశారు. **- వాజేడు**

కష్టాలు ఎదుర్కొని..



గడ్డం ఫణీంద్ర

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఒడిపిలవంచ గ్రామానికి చెందిన గడ్డం ఫణిందర్ జిల్లా 3వ ర్యాంకు సాధించాడు. తండ్రి వైకుంఠం ఏడాది కిందట మృతి చెందగా తల్లి పద్మ గ్రామంలో రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నారు. గతేడాది డిసెంబర్‌లో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నియామకాల్లో మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ఉద్యోగం సాధించాడు. డీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో ఉద్యోగానికి సెలవు పెట్టి పట్టుదలతో చదివి ఉన్నత ర్యాంకు సాధించాడు. గ్రూప్-4లోనూ జిల్లాలో 13వ ర్యాంకు తెచ్చుకున్నారు. – కాటారం

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న స్వామిదాస్

ములుగు, న్యూస్‌టుడే: ములుగు మండలం బండారుపల్లిలోని తెలంగాణ బాలుర రెసిడెన్షియల్ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోతు స్వామిదాస్ హాజరై అవగాహన కల్పించారు. పలు చట్టాల గురించి వివరించారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాచర్ల రాజ్‌కుమార్, ప్రిన్సిపల్ ఎం.అమృతరెడ్డి, ఉపాధ్యాయులు కె.రంజిత్‌కుమార్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఘోర ప్రమాదం.. తప్పిన పెనుముప్పు

బస్సు బోల్తా.. 20 మందికి గాయాలు



జనగామ మండలం యశ్వంతాపూర్ వద్ద జాతీయ రహదారిపై బోల్తా పడిన బస్సు

జనగామ రూరల్, న్యూస్‌టుడే: జనగామ జిల్లా కేంద్రం సమీపంలోని యశ్వంతాపూర్ పరిధి హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బస్సు ముందు టైరు పేలిపోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, 19 మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. జనగామ సీఐ దామోదర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరు నుంచి వరంగల్‌కు బయల్దేరిన ఓ ప్రైవేటు ట్రావెల్ సంస్థకు చెందిన లగ్జరీ బస్సులో 20 మంది ప్రయాణికులున్నారు. జనగామ మండలం యశ్వంతాపూర్-నిడిగొండ గ్రామాల మధ్య బస్సు రాగానే ముందు టైరు పేలడంతో ప్రమాదం జరిగింది. అందులో ఉన్న జయశంకర్ భూపాలపల్లికి చెందిన పోషయ్యకు చేయి పూర్తిగా విరిగి నుజ్జు నుజ్జయింది.

హాహాకారాలతో దద్దరిల్లిన ఘటనాస్థలి..

బస్సు ముందు టైరు పేలిపోవడంతో అదుపు తప్పి డివైడర్ ఎక్కి బోల్తా పడింది. ఈ హఠాత్పరిణామంతో ప్రయాణికుల హాహాకారాలు దద్దరిల్లాయి. ఏం జరిగిందో అర్థమయ్యే లోపు బస్సులోనే ఒకరిపై మరొకరు పడిపోయారు. గమనించిన వాహనదారులు వారిని రక్షించేందుకు సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులకు సమాచారం అందడంతో హుటాహుటిన అక్కడకు చేరుకొని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం జనగామ ఏరియాసుపత్రికి తరలించారు. ఘటనాస్థలిని జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్, సీఐ దామోదర్‌రెడ్డి పర్యవేక్షించారు. బస్సు రహదారికి అడ్డుగా పడటంతో దాదాపు రెండు కి.మీ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పక్కకు జరిపించి రాకపోకలను పునరుద్ధరించారు. జరిగింది పెద్ద ప్రమాదమే అయినా ఎలాంటి ప్రాణ నష్టం చోటు చేసుకోకపోవడంతో ప్రయాణికులు, పోలీసులు, స్థానికులు అంతా ఊపిరి పీల్చుకున్నారు.

రైతేరాజు వివరాలు 8లో..

నేడు అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

ములుగు టౌన్, న్యూస్‌టుడే: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా పాలనాధికారి కార్యాలయంలో వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి శిరీష సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని వయోవృద్ధులు, అసోసియేషన్ సభ్యులు, ఓల్డ్‌హోమ్ నిర్వాహకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విన్నవించాం.. పరిష్కరించండి..!



అర్జీని పరిశీలిస్తున్న పాలనాధికారి దివాకర

ములుగు, న్యూస్‌టుడే: ప్రజావాణి వచ్చిన ఫిర్యాదులను జాప్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా పాలనాధికారి టీఎస్.దివాకర అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావులతో కలిసి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దని, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పరిష్కారంలో ఆలస్యమైతే కారణాలను ఫిర్యాదుదారుకు తెలియజేయాలన్నారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 51 దరఖాస్తులను స్వీకరించగా, ఎక్కువగా రెవెన్యూ, ఫించన్లకు సంబంధించినవి ఉన్నాయి. జిల్లా వైద్యాధికారి ఎ.అప్పయ్య, డీసీవో సర్దార్‌సింగ్, వివిధశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల వివరాలు
రెవెన్యూ: 11
పింఛన్లు : 10
ఉద్యోగాలు: 9
భూ తగాదాలు: 12
ఇతర సమస్యలు: 9

నా భూమిని సర్వే చేయాలి

బి.రాజు, అన్నంపల్లి, ములుగు



నా తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని సర్వే చేయాలని పలు మార్లు దరఖాస్తు చేసినా పట్టించుకోవడం లేదు. అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా స్పందన కరువైంది. సర్వే చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలి.

జీవనం కష్టంగా ఉంది..

- గడ్డం లక్ష్మి, మంగపేట



రెండేళ్ల క్రితం నా భర్త మృతిచెందాడు. నా భర్త బతికున్నపుడు ఆసరా పింఛన్ వచ్చేది. ఆయన చనిపోయాక పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా. అధికారుల దగ్గరకు వెళ్లి పింఛన్ గురించి అడిగితే పట్టించుకోవడం లేదు. జీవనం కష్టంగా ఉంది. పింఛను వస్తే కొంత ఆసరాగా ఉంటుంది.

వైకల్యం ఉన్నా పింఛన్ రావడం లేదు

- జి.సాంబయ్య, మల్లూరు, మంగపేట



44 శాతం వైకల్యంతో బాధపడుతున్నా.. ఇందుకు నాకు సదరం ధ్రువపత్రం కూడా ఉంది. దివ్యాంగుల పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఇంతవరకు మంజూరు చేయలేదు. అధికారులు స్పందించి పింఛన్ ఇప్పించాలి.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ



దరఖాస్తుదారుతో మాట్లాడుతున్న పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ప్రజావాణిలో స్వీకరించే దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా అధికారులను ఆదేశించారు. ఏటూరునాగారం పట్టణంలోని ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పీవో వివిధ మండలాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ ఉంచకుండా త్వరగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో మొత్తం 15 దరఖాస్తులను స్వీకరించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రుణం మంజూరు చేయాలి

బానోతు దినేష్, గట్టికల్, రాయపర్తి



మా నాన్న ట్రైకార్ రుణానికి దరఖాస్తు చేసుకున్నారు. జనరల్ దుకాణం ఏర్పాటు చేయాలనుకున్నాం. ఇటీవల ఆయన మృతి చెందాడు. ప్రస్తుతం మంజూరైన రుణాన్ని నా పేరున బదిలీ చేసి యూనిట్ ఇప్పించాలని చాలా రోజులుగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

నాలుగేళ్లుగా తిరుగుతున్నా..

- వాసం సుగుణ, శివాపురం, ఏటూరునాగారం



నా భర్త నాలుగేళ్ల క్రితం మృతిచెందారు. ఆయన పేరున ఉన్న 3.20 ఎకరాల భూమిని నా పేరు మీదకు మార్చాలని పలుమార్లు ప్రజావాణిలో అర్జీ ఇచ్చాను. నాలుగేళ్లుగా అధికారులు పట్టించుకోవడం లేదు. రైతుబంధు రావడం లేదు.

● కన్నాయిగూడెం మండలం సర్వాయికి చెందిన పొడెం శోభన్ తమ ఇళ్లకు విద్యుత్తు సరఫరా చేసే స్తంభం పడిపోయిందని, వెంటనే పునరుద్ధరించాలని విన్నవించారు.

● సాగులో ఉన్న భూమికి హక్కు పత్రాలు ఇప్పించాలని ఏటూరునాగారం మండలం ఆకులవారిఘణపురం గ్రామానికి చెందిన గండెపల్లి నర్సయ్య అర్జీ ఇచ్చారు.

● వాజేడు మండలం గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన ఇర్ప వెంకటనర్సమ్మ తాను వేసిన ఎల్‌టీఆర్ కేసుపై తుది తీర్పు ఇవ్వాలని కోరారు.

● వెంకటాపురం మండలం దానవాయిపేటకు చెందిన కోరం కిరణ్ ఆశ్రమ పాఠశాలలో రోజువారీ కూలీ పనులు చేసేందుకు అనుమతించాలని విన్నవించారు.


● గోవిందరావుపేట మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందిన భూక్యా శ్రీను తాను మహబూబాబాద్‌లో పని చేస్తున్నానని, ములుగు జిల్లాలో డిప్యూటేషన్ ఇప్పించాలని కోరారు.

పోషణ చట్టం.. వృద్ధులకు పట్టం

పిల్లలను పెంచి.. పెద్దచేసిన తల్లిదండ్రులు వృద్ధాప్యంలో నిరాదరణకు గురవుతున్నారు.. దీంతో ముదిమి వయసులో క్షోభ అనుభవిస్తున్నారు.. బతుకుమార్గం చూపిన అమ్మానాన్నలకు కంటికిరెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క రిపై ఉంది.. చట్టపరంగా వృద్ధులకు హక్కులు ఉన్నాయి.. నిరాదరణకు గురవుతున్న సందర్భాల్లో న్యాయస్థానాలు అండగా ఉంటున్నాయి.. మంగళవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

'వయోవృద్ధులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా టోల్‌ఫ్రీ 14567 నంబరును సంప్రదించాలి.'

న్యూస్‌టుడే- హనుమకొండ కలెక్టరేట్, గిర్మాజీపేట, ములుగు



రైతు బంధు, కౌలు డబ్బులు వచ్చేలా చేశారు



ములుగు మండలం జాకారం గ్రామానికి చెందిన ఈయన పేరు మామిడిశెట్టి చిన్న మల్లయ్య.. ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరికి పెళ్లిళ్లు చేసి ఇళ్ల స్థలాలు, భూములు పంచి ఎకరం భూమిని తమ పోషణ నిమిత్తం ఉంచుకున్నారు. ఆ భూమి పొరపాటున పెద్ద కొడుకు రాజు పేరున పాస్‌బుక్‌లో నమోదైంది. దీంతో రైతుబంధు పెద్దకుమారుడికే చెందుతోంది. తండ్రి తన పోషణ నిమిత్తం ఉంచుకున్న భూమిని చిన్న కుమారుడు కౌలుకు చేస్తూ కౌలు డబ్బులు తండ్రికి ఇవ్వడం లేదు. దీంతో మామిడిశెట్టి చిన మల్లయ్య ములుగు ఆర్డీవో సత్యపాల్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారి చట్ట ప్రకారం నోటీసులు జారీ చేశారు. తహసీల్దారు విచారణ జరిపి ఆర్డీవోకు నివేదిక సమర్పించారు. ఇరువురి వాదనలు విన్న ఆర్డీవో మల్లయ్య భూమి అర్జీదారు పేరిట నమోదు చేయడానికి సెప్టెంబరు 9న ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రైతు బంధు, కౌలు డబ్బులు అర్జీదారుకు చెందేలా మార్గం సుగమమైంది.

ప్రతి నెలా రూ.2 వేలు చెల్లించాలి



వెంకటాపురం మండలం నల్లగుంట గ్రామానికి చెందిన గోడిశాల సమ్మక్కకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. పెద్ద కొడుకు ఉద్యోగరీత్యా హనుమకొండలో ఉంటున్నారు. ఊళ్లో ఆయనకు పంచి ఇచ్చిన ఇంట్లో సమ్మక్క నివాసం ఉంటోంది. చిన్న కొడుకు మరణించిన తర్వాత కోడలు ఆ ఇంట్లో సమ్మక్కను ఉండనివ్వడం లేదు. పెద్ద కుమారుని వాటా కూడా తమకే చెందుతుందని గొడవ పడింది. దీంతో వేరే ఇంట్లో నివాసం ఉంటున్నానని ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఇరువురికి నోటీసులు జారీ చేశారు. వాదనలు విన్న అనంతరం పెద్ద కుమారుడి వాటాగా ఉన్న ఇంటిలో సమ్మక్క నివాసం ఉండేలా, ఆమె జీవనానికి పెద్ద కుమారుడు రవిందర్, చిన్న కోడలు శ్రీలత నెలకు రూ.2 వేలు ఇవ్వాలని ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి ఆదేశిస్తూ సెప్టెంబరు 19న ఉత్తర్వులు జారీ చేశారు.

అండగా చట్టాలు..

తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణభారం, సంరక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయి.. హిందూ దత్తత, పోషణ చట్టం-1956 ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రేమతో కేసులు వేయడం లేదు. దీంతో వేగవంతమైన సహాయాన్ని అందించేందుకు న్యాయ స్థానాలతో సంబంధం లేకుండా తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం- 2007ను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. తెలంగాణ ప్రభుత్వం సవరణ నియమావళి-2022ను రూపొందించింది.

దరఖాస్తు ఎవరికి సమర్పించాలి..?

వృద్ధులు, తల్లిదండ్రులు ఎక్కడ నివసిస్తున్నారో, ఇంతకుముందు చివరిసారిగా ఎక్కడ నివసించారో తెలుపుతూ వారి పిల్లలు లేదా బంధువులు ఎక్కడ నివసిస్తారో.. తెలుపుతూ ఆయా జిల్లాలోని రెవెన్యూ డివిజనల్ అధికారి(మెయింటనెన్స్ ట్రిబ్యునల్), జిల్లా సంక్షేమాధికారికి పోషణ ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకోవాలి.

90 రోజుల్లో విచారణ

వయోవృద్ధులు దరఖాస్తు చేసుకున్న 90 రోజుల వ్యవధిలో ట్రైబ్యునల్ పిల్లలకు నోటీసులు పంపించి విచారణాధికారులచే వాదనలు, సాక్ష్యాలు సేకరించి పోషణ ఖర్చుల చెల్లింపునకు ఆదేశిస్తుంది.. మూడు నెలల పాటు సదరు పిల్లలు పోషణ ఖర్చులు ఇవ్వకపోతే తల్లిదండ్రులు తిరిగి ట్రైబ్యునల్‌ను ఆశ్రయించొచ్చు. ఉత్తర్వులు పాటించని పిల్లలు, బంధువులకు జరిమానా, జైలు శిక్ష విధించే హక్కు దానికి ఉంటుంది. పిల్లలు, బంధువులు పోషణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే తిరిగి వారి ఆస్తులను స్వాధీనం చేసుకునే హక్కు ఉంటుంది.

☛ నడవలేని వయోవృద్ధులకు వీల్‌ఛైర్స్, చేతి కర్రలు, ఇతర పరికరాలు, వినికిడి యంత్రాలు, కళ్లజోడులు అందజేస్తారు. వృద్ధులు జిల్లా సంక్షేమాధికారికి దరఖాస్తు చేసుకోవాలి. వృద్ధాప్యంలోని తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే.. పిల్లలతో ఇబ్బందులు ఎదురైతే జిల్లా సంక్షేమాధికార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ జిల్లా ఇన్‌ఛార్జి సంక్షేమాధికారిణి రాజమణి తెలిపారు.

ఆశ్రమాల్లో ఆదరణ..

నిరాదరణకు గురైన వృద్ధులకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనాథాశ్రమాల్లో సేవలు అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 వృద్ధాశ్రమాలు ఉండగా అందులో సుమారు 474 మంది ఉంటున్నారు.


జిల్లా	ఆశ్రమాలు	వృద్ధుల సంఖ్య
హనుమకొండ	10	252
వరంగల్	05	154
జనగామ	02	30
మహబూబాబాద్	01	12
భూపాలపల్లి	01	10
ములుగు	01	16



నగరంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి..

-తేరాల యుగంధర్, వయోవృద్ధుల సంక్షేమ సంస్థ కార్యదర్శి



2018లో మేం వయోవృద్ధుల సంక్షేమ సంఘాన్ని స్థాపించాం. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఛైర్మన్‌గా ఉన్నారు. చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. లయన్స్ క్లబ్ సహకారంతో కంటి వైద్య పరీక్షలు చేయిస్తున్నాం. మా పోరాటం వల్లే ఎంజీఎం ఆసుపత్రిలో వృద్ధుల కోసం ప్రత్యేకంగా ఓపీ విభాగం ఏర్పాటు చేశారు.



టోల్‌ఫ్రీ నంబరుపై వృద్ధులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు (పాత చిత్రం)

కనీసం తిండి పెట్టకుండా..



స్టాండు సాయంతో మెట్లు దిగుతున్న ఈ వృద్ధుడి పేరు వేల్పుల నర్సయ్య వయసు 90 ఏళ్లు.. సంగెం మండలం గవిచర్ల నివాసి.. భార్య ఆగమ్మ అనారోగ్య సమస్యలతో మంచానికే పరిమితమయ్యారు. తన నాలుగెకరాల భూమిలో 2.5 ఎకరాలను కుమారుడు అక్రమంగా పట్టా చేసుకున్నాడు. మిగిలిన భూమి చెరువు శిఖం కింద ఉంది. గతంలో ఇద్దరు కుమార్తెలకు పసుపు, కుంకుమ కింద 10 గుంటల చొప్పున రాసిచ్చాడు. ఆ భూమిపై కన్నేసిన కుమారుడు తన పేరుపై రాసివ్వాలని ఒత్తిడి తెస్తూ.. తల్లిదండ్రులైన ఇద్దరు వృద్ధులను ఓ చిన్న గదిలో ఉంచి తిండి పెట్టడంలేదు. ఇష్టమొచ్చినట్లు కొడుతున్నాడని కన్నీటి పర్యంతమయ్యారు. తన బాధను గత జులైలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

గిఫ్ట్ డీడ్ రద్దు చేసి..

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పైడిచింతలపల్లి గ్రామానికి చెందిన గడ్డం బాపురెడ్డి కుమారుడైన స్వామిరెడ్డికి 6.5 ఎకరాలను గిఫ్ట్ డీడ్ చేశారు. కాగా, వృద్ధాప్యంలో బాగోగులు చూడడం లేదని.. కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో కుమారుడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో గిఫ్ట్ డీడ్‌ను రద్దుచేయాలని గత ఆగస్టులో దరఖాస్తు చేశారు. కలెక్టర్ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి గిఫ్ట్‌డీడ్‌ను రద్దుచేసి తిరిగి తండ్రి పేరిట భూమిని బదిలీ చేయాలని అధికారులను ఆదేశించారు. తండ్రి పోషణకు ప్రతి నెలా రూ.10 వేలు చెల్లించాలని కుమారుడిని ఆదేశించారు.

అవార్డుల స్ఫూర్తితో అభివృద్ధి




మేయర్ సుధారాణికి ధ్రువపత్రం అందిస్తున్న అధికారులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: స్మార్ట్‌సిటీ, నైబర్ హుడ్ ఛాలెంజ్ పోటీల్లో గ్రేటర్ వరంగల్‌కు అవార్డులు రావడం గర్వకారణమని, ఇదే స్ఫూర్తితో అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఇటీవల కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణశాఖ ఇచ్చిన 'ఎక్సలెన్స్' ధ్రువపత్రాన్ని సోమవారం రాత్రి బల్దియా ప్రధాన కార్యాలయంలో అధికారులు మేయర్‌కు అందజేశారు. ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈ శ్రీనివాస్, డీఈలు కృష్ణమోహన్, కృష్ణమూర్తి, రంగారావు, ఏఈలు పాల్గొన్నారు.

యువ పరిశోధకులకు ప్రోత్సాహం



ప్రభాకర్



నరేంద్రకుమార్

నెల్లికుదురు, న్యూస్‌టుడే: మిరప పంటను ఆశిస్తున్న నల్లతామర తెగులు నివారణకు పరిశోధనలు చేసి సేంద్రియ ఆధారిత మందులు తయారుచేసిన యువ పరిశోధకులను తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ద్వారా ప్రభుత్వం అందించే రూ.5 లక్షల టీ-స్పార్క్ గ్రాంట్ వరించింది. వివిధ రంగాల్లో పరిశోధనలు చేస్తున్న వారి నుంచి 2024 ఆగస్టులో అంతర్జాలం ద్వారా ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరి యువకుడు గాజుల ప్రభాకర్, డోర్నకల్ యువకుడు నరేంద్రకుమార్ ఓయూలో ఎంఎస్సీ పీహెచ్‌డీ పూర్తి చేసి శ్రీజీపీఎవెన్ లైఫ్ సైన్సెస్ అనే స్టార్టప్ సంస్థను స్థాపించి పంటలపై ఆశించే పురుగు, తెగుళ్ల నివారణకు పరిశోధనలు చేస్తున్నారు. హైదరాబాద్ ఐకేపీ నాలెడ్జ్ పార్క్ సహాయంతో త్రిప్ క్లియర్ అనే సేంద్రియ ఆధారిత పురుగు మందు రూపొందించారు. టీ-స్పార్క్ వారు పలుమార్లు పరిశీలించి గ్రాంట్‌కు తమ సంస్థను ఎంపిక చేశారని ప్రభాకర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. తమ ఉత్పత్తిని త్వరలో మార్కెట్లోకి తీసుకురానున్నట్లు వారు వివరించారు.

కాలుష్యపు కోరల్లో.. మంచినీళ్ల చెరువు



రైతు బాలయ్య కుడి చేతి సీసాలో స్వచ్ఛమైన నీరు.. ఎడమచేతిలో కలుషితమైన చెరువు నీరు

వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రం శివారులోని 'మంచినీళ్ల చెరువు' కాకతీయుల కాలం నుంచి గ్రామ ప్రజలకు తాగునీటి వరప్రదాయిని. పంట పొలాలకు సాగు నీరు అందించే ప్రధాన జలవనరు. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో కళకళలాడిన తాటాకం నేడు కోళ్ల పరిశ్రమ వ్యర్థాలతో కాలుష్య కాసారంగా మారింది. సుమారు 115 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు కింద 300 ఎకరాల ఆయకట్టు ఉంది. సుమారు 120 మత్స్యకార కుటుంబాలు ఈ చెరువుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. పదేళ్ల క్రితం వరకు చెరువులో నాణెం వేసినా స్పష్టంగా కనపడేదని స్థానికులు తెలిపారు. తొమ్మిదేళ్ల క్రితం కోళ్ల పరిశ్రమ వెలిసినప్పటి నుంచి మంచినీళ్ల చెరువు కాలుష్యపు కోరల్లో చిక్కుకుంది. పశుపక్ష్యాదులు సైతం ఈ నీటిని తాగలేని పరిస్థితి. గ్రామానికి మంచి నీటిని సరఫరా చేసే బోరు బావులు చెరువులోనే ఉండటంతో.. ఈ నీటిని తాగిన వారు జబ్బుల బారిన పడుతున్నారు. స్నానపానాదులకు ఈ నీటిని వాడినా.. చర్మవ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. కోళ్ల పరిశ్రమ నిర్వాహకులు ఓ కాలువ ద్వారా అర్ధరాత్రి వ్యర్థాలను చెరువులో వదులుతున్నారు. దీనిపై గ్రామస్థులు ఉద్యమం ప్రారంభించారు. గ్రామ పరిరక్షణ కమిటీ పేరిట అధికారులు, ప్రజాప్రతినిధులకు తమ గోడు చెబుతున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో పాలనాధికారి డా.సత్యశారదను కలిసి సమస్య విన్నవించారు.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే రాయపర్తి



వరంగల్ కలెక్టరేట్ ఎదుట రాయపర్తి గ్రామ పరిరక్షణ కమిటీ సభ్యులు

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	110
రిటైల్:	132
డ్రెస్డ్:	191
స్కిన్‌లెస్:	218

మేళతాళాలు.. పూల జల్లుల మధ్య ఉపాధ్యాయులకు వీడ్కోలు

నర్సింహులపేట, న్యూస్‌టుడే: బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు మేళతాళాల మధ్య పూలు చల్లుతూ, కోలాటాలు వేస్తూ ఆనందోత్సాహాల మధ్య వీడ్కోలు, కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు నర్సింహులపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు. వారం రోజుల కిందట ఇతర పాఠశాలలకు 18 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. పదకొండేళ్లపాటు తమకు చదువులు చెప్పిన గురువులకు వీడ్కోలు సమావేశంలో పూలమాలలు వేసి శాలువా, జ్ఞాపికలతో సన్మానించి కన్నీరుమున్నీరయ్యారు. ఇటీవల పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నర్సిరెడ్డి, పూర్వ ప్రిన్సిపల్ ఆనంద్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సెమీస్ చేరిన నల్గొండ, మహబూబ్‌నగర్ జట్లు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఓరుగల్లు కేంద్రంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో నల్గొండ, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల జట్లు సెమీస్‌కు చేరాయి. సోమవారం కోమటిపల్లి మైదానంలో వరంగల్, నల్గొండ జట్ల మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వరంగల్ జట్టు 16.5 ఓవర్లలో 52 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఛేదనలో నల్గొండ జట్టు 19 ఓవర్లలో 53 పరుగులు చేసి విజయం సాధించింది. నల్గొండ బౌలర్లలో యశ్వంత్ 4 వికెట్లు, శ్రీఖర్ 3 వికెట్లు పడగొట్టి విజయంలో కీలకపాత్ర పోషించారు. మొగిలిచర్ల మైదానంలో మహబూబ్‌నగర్, మెదక్ జట్ల మ్యాచ్ జరిగింది. నిర్ణీత 50 ఓవర్లలో మహబూబ్‌నగర్ జట్టు మూడు వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. అభిలాష్ 66 పరుగులు, అబ్దుల్ 54 పరుగులు చేశారు. తర్వాత బాటింగ్‌కు దిగిన మెదక్ జట్టు 32.1 ఓవర్లలో 127 పరుగులకే ఆలౌట్ అయ్యింది. మంగళవారం నుంచి పూల్ 'బి'లోని కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల మ్యాచ్‌లు ఉంటాయని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ క్రీడలకు ఎంపిక

అడ్డంకిగా మారిన పేదరికం



ప్రతిభకు అవయవలోపం, పేదరికం అడ్డుకాదని నిరూపించారు పలిమెల మండల కేంద్రానికి చెందిన కావేరి జ్యోతి.. అయిదేళ్ల వయసున్నప్పుడే రోడ్డు ప్రమాదంలో కుడి కాలు కోల్పోయారు. ప్లాస్టిక్ కాలు సాయంతో నడుస్తున్నారు. ప్రస్తుతం హనుమకొండ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. ఇంటర్ చదువుతున్న సమయంలో జేఎన్ స్టేడియంలో జరిగిన పోటీలను చూసి క్రీడల్లో ఆసక్తి పెంచుకున్నారు. సెప్టెంబరు 1న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ త్రోబాల్ పోటీల్లో పాల్గొని పసిడి పతకాలు సాధించి జాతీయ స్థాయి ఆటలకు ఎంపికయ్యారు. సెప్టెంబరు 22 నుంచి 26 వరకు ఝార్ఖండ్ రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఆడి అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. అంతర్జాతీయ స్థాయి పారా త్రోబాల్ విభాగంలో ఎంపికయ్యారు. డిసెంబరులో కంబోడియా దేశంలో జరిగే అంతర్జాతీయ ఆటల్లో పాల్గొనేందుకు రూ.లక్ష ఖర్చవుతుందని, అక్టోబరు 15లోపు రూ.50,000 చెల్లిస్తేనే అర్హత పొందుతానని ఆమె తెలిపారు. జ్యోతి తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కావడంతో రూ.లక్ష సమకూర్చడం భారంగా మారింది. దాతలు ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పలిమెల(భూపాలపల్లి జిల్లా)

వరికి సుడిదోమ 'పోటు'!

న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం



ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరి పంటకు సుడిదోమ సోకి తీవ్రంగా నష్టపరుస్తోంది. ఈ సారి 7.50 లక్షల ఎకరాల్లో సాగైనట్లు అంచనా.. ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. భారీ వర్షాల తర్వాత వాతావరణం ఉక్కపోతగా మారడంతో సుడిదోమ ఉద్ధృతి పెరిగినట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు గుర్తించారు. తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మామునూరు కృషి విజ్ఞానకేంద్రం కీటక శాస్త్రవేత్త డా. రాజు, వరంగల్ జిల్లా వ్యవసాయాధికారి కె. అనురాధ రైతులకు సూచించారు. 'పొలాల్లో నీటిపై భాగంలో దోమలు తేలుతూ మొదళ్ల చుట్టూ తిరుగుతూ రసాన్ని పీల్చడంతో ఆకులు పసుపు రంగులోకి మారుతాయి. మొక్క సుడులుగా ఎండిపోతుంది. పొట్ట దశలో ఉద్ధృతి ఎక్కువైతే గింజరాదు. నూక శాతం పెరిగి దిగుబడి పడిపోతుంది. పొలాల్లో తూర్పు, పడమర దిశగా రెండు మీటర్ల దూరంగా పాయలు ఏర్పాటు చేస్తే పంటకు గాలి, వెలుతురు సోకి దోమ ఉద్ధృతి తగ్గుతుంది. పొలంలో నీరు పెడుతూ తీసివేస్తే గుడ్లు, పిల్ల దోమల ఉద్ధృతి తగ్గుతుంది. దోమ కనిపించిన మొదటి దశలో వేపనూనె 1500 పీపీఎం 5 మి.లీ నీటికి కలిపి పిచికారీ చేయాలి. తర్వాత దశలో ట్రైఫ్లుమిజోపైరిమ్ మందును 94 మి.లీ ఎకరానికి పిచికారీ చేయాలి. దోమ ఉద్ధృతి ఎక్కువగా ఉంటే లీటరు నీటికి 1.5 గ్రా. ఎసిఫేట్ 75 ఎస్.పి కలిపి వరి మొదళ్లపై పడేలా పిచికారీ చేయాలి. అప్పటికీ నివారణ కాకపోతే లీటరు నీటికి 0.4 గ్రా. డైనోటెఫ్యూరాన్ 20 ఎస్‌జి లేదా 0.60 గ్రా పైమెట్రోజిన్ 50 డబ్ల్యూజి లేదా ట్రైఫ్లూమెజోపైరిమ్ 0.485 మి.లీ కలిపి పిచికారీ చేయాలి. పొట్ట దశలో యూరియాతో పాటు పొటాష్ కలిపి వేసుకుంటే మొక్కకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని' వివరించారు.



దోమ ఉద్ధృతిని పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త డా.రాజు

రైతేరాజు

ఉల్లిసాగుకు సమయమిదే...

గోపాల్‌పూర్, న్యూస్‌టుడే : ఉల్లికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. వినియోగం పెరగడంతో ధరలు కూడా నిలకడగా ఉంటున్నాయి. సాగులో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే.. లాభాలు గడించవచ్చని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా.రాజు తెలిపారు. 'వర్షాకాలంలో నవంబర్‌లోగా విత్తుకునే అవకాశం ఉంది. ఉల్లి సాగుకు ఎకరాకు మూడు, నాలుగు కిలోల విత్తనాలు అవసరమవుతాయి. నేలను బాగా దున్ని 120 సెం.మీ వెడల్పు, 3 మీటర్ల పొడవైన నారుమళ్లను తయారు చేసుకోవాలి. రెండు కిలోల విత్తనం 200 చ.మీ.ల నారుమడికి సరిపోతుంది. విత్తనశుద్ధి చేయాలి. మూడు గ్రాముల కాప్టాన్ లేదా థైరామ్ కిలో విత్తనానికి కలిపి నారుమడిలో పలచగా వరుసల్లో పోయాలి. నారుకుళ్లు తెగులు సోకకుండా పది రోజులకోసారి కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నారు పురుగు ఆశించకుండా కార్బోప్యురాన్ 3జీ గుళికలు నారుమడిలో చల్లి నీరు కట్టాలి. నాటిన 75 రోజుల తర్వాత మాలిక్ హైడ్రజైడ్ 2.5 గ్రా. లీటరు నీటికి ద్రావణాన్ని చల్లడం వల్ల మొలక నష్టం బాగా తగ్గుతుంది. నారునాటిన వంద రోజులకు కార్బండిజమ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే కుళ్లడం చాలా వరకు తగ్గుతుంది. ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువుతో పాటు 80 కిలోల నత్రజని, 30 కిలోల భాస్వరం, 24 కిలోల పొటాష్ ఎరువులను వేయాలి. వేరుశనగ పిండి లేదా ఆముదపు పిండి వేసి, మట్టిని ఎగదోయడం వల్ల ఎక్కువ దిగుబడి వస్తుంది. నత్రజనిని రెండు దఫాలుగా వేసుకుంటే గడ్డ బాగా ఊరుతుంది. నాటిన 60 రోజుల వరకు 15 రోజుల వ్యవధిలో నాలుగు, అయిదు తడులు ఇవ్వాలి. గడ్డ ఊరే దశలో ఏడు రోజుల వ్యవధిలో ఏడు, ఎనిమిది తడులివ్వాలి. కోతకు 15 రోజుల ముందుగా నీరు కట్టడం ఆపాలి. వానాకాలం ఎకరానికి 80 నుంచి 100 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. యాసంగిలో 130 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని' వివరించారు.



డా.రాజు.శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, మామునూరు.



దేవన్నపేటలో సాగుచేసిన ఉల్లి

ప్రశ్న-సమాధానం

? మిరప పంటలో తామర పురుగుల నివారణ చర్యలు తెలపండి..? -వి.బుచ్చిరెడ్డి. దేవన్నపేట

✔ తామర పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసం పీల్చడంతో పైకి ముడుచుకుంటాయి. దీన్ని నివారించడానికి నాటిన 15, 45, రోజులకు ఎకరాకు 8 కిలోల ఫిప్రోనికల్ గుళికలు తగినంత తేమ ఉన్నప్పుడు వేయాలి. అవసరాన్ని బట్టి ఎసిఫేట్ 1.5 గ్రా. డైమిథియేట్ 2 మి.లీ. లేదా క్లోరోపైరిఫాస్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

-తిరుపతి, ఉద్యానశాఖ అధికారి, వరంగల్


–న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం



తామర పురుగులు ఆశించడంతో ముడుచుకుపోయిన మిరప మొక్కలు

గులాబీ.. లాభాల గుబాళింపు

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే : మెట్ట ప్రాంతంలో గులాబీ తోట సాగుచేసి కొంత మంది కూలీలకు ఉపాధి కల్పిస్తూ లాభాలు పొందుతున్నారు. మండంలోనే గులాబీ తోట సాగు చేసి ఆదర్శంగా నిలిచారు.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సిర్లపల్లి గ్రామానికి చెందిన రైతు తూముల చక్రధర్‌రావు సుమారు పదేళ్ల కిందట హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం జీల్గుల గ్రామంలో రెండెకరాల భూమి కొనుగోలు చేశారు. అందులో వ్యవసాయం చేస్తున్నాడు. ఎకరంలో వరి, పత్తి సాగు చేశాడు. మిగతా ఎకరంలో సుమారు రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టి ఏడాది క్రితం గులాబీ తోట సాగు చేశారు. నెల నుంచి పువ్వులు దిగుబడి తీస్తున్నారు. వారంలో రెండు సార్లు కోసి విక్రయిస్తున్నారు. చెట్లకు మూడు రోజులకోసారి 40 నుంచి 50 కిలోల పూలు పూస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.80 నుంచి రూ.100 వరకు ధర ఉంది. తోట వద్దకు వచ్చేవారికి రూ.100కు కిలో చొప్పున విక్రయిస్తున్నారు. రైతు చక్రధర్ మాట్లాడుతూ... నెల రోజులుగా పూలు పూస్తున్నాయి. పండగల వేళల్లో ధర ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయాధికారుల సూచన మేరకు సస్యరక్షణ చేపడుతున్నాం.. మొక్కలకు దిగుబడి అనంతరం కొమ్మల కత్తిరింపు చేపడుతూ.. పదేళ్ల వరకు పూల దిగుబడి పొందవచ్చని వివరించారు.



చక్రధర్‌రావు




ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా!



వెంకటాపురం పట్టణం లోని ఉప తపాలా కార్యాలయానికి వెళ్లే మార్గంలో విద్యుత్తు స్తంభం వద్ద ముప్పు పొంచి ఉంది. నివాసాలకు చెందిన సర్వీసు తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. ఏమాత్రం ఏమరుపాటు వహించినా వాహనదారులు అపాయంలో చిక్కుకునే పరిస్థితి నెలకొంది. ఈ స్తంభాన్ని తొలగించడంతో పాటు తీగలను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. – న్యూస్‌టుడే, వెంకటాపురం(ములుగు జిల్లా)

నియంత్రికపై పిడుగుపాటు.. ఎండుతున్న పంటలు



పిడుగుపడి పాడైపోయిన విద్యుత్తు నియంత్రిక

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని హాస్టల్‌గడ్డ ప్రాంతంలోని విద్యుత్తు నియంత్రికపై పది రోజుల క్రితం పడిన పిడుగుపాటుకు నియంత్రిక పూర్తిగా పాడైపోయింది. ఈ విషయాన్ని పరిసర ప్రాంతాల్లోని రైతులు విద్యుత్తు శాఖ అధికారులకు తెలియజేశారు. నియంత్రికను త్వరితగతిన బాగు చేయాలని విన్నవించారు. ఆదివారం వరకు చూసిన అధికారులు నియంత్రికలు అందుబాటులో లేవని, అవి వచ్చేంతవరకు వేచి ఉండాలని చెప్పడంతో.. అన్నదాతల్లో ఆందోళన రెట్టింపయ్యింది. ఉన్నతాధికారులకు ఫోన్లు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 15 మంది కర్షకులకు సంబంధించిన సుమారు 50 ఎకరాలు సాగవుతుందని, సాగు నీరు లేక వరి పైరు ఎండిపోతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించి పంట పొలాలను రక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



నీరు లేక ఎండుతున్న వరి

మేమున్నాం.. మీకు తోడుగా

వాజేడు: 8008573708, వెంకటాపూర్: 9440692140
ఏటూరునాగారం: 9440194979, వెంకటాపురం: 8008624242

తాడ్వాయి, న్యూస్‌టుడే: మండలంలోని నర్సింగాపురం కాంబోజ చెరువు తూముల నుంచి సాగు నీరంతా వృథాగా పోతోంది. **- పిట్టల సారయ్య, రైతు**

లష్కర్లను పురమాయించి సాగునీటి వృథా నివారణకు తాత్కాలిక చర్యలు చేపడతాం.

- అరవింద్, సహాయ ఇంజినీరు

కన్నాయిగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని కంతనపల్లి గ్రామంలోని వాటర్‌ట్యాంకు వద్ద పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. **- వెంకన్న, కంతనపల్లి**

పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- నారాయణ, పంచాయతీ కార్యదర్శి

కన్నాయిగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని సర్వాయి గ్రామంలో రహదారి పక్కన వ్యర్థాలు పేరుకుపోయాయి. ఈ మార్గంలో వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది.

- పవన్, సర్వాయి

పారిశుద్ధ్య చర్యలు చేపడతాం.

- మనోజ్, పంచాయతీ కార్యదర్శి

ములుగు టౌన్, న్యూస్‌టుడే: ములుగు పట్టణంలోని శ్రీనివాస కాలనీలో గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడంలేదు. రాత్రివేళ బయటకు రాలేకపోతున్నాం. విష పురుగులు సంచరించే ప్రమాదం ఉంది.

- మాలోత్ ప్రేమ్‌సింగ్, శ్రీనివాసకాలనీ

రెండు రోజుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం.

- రఘు, పంచాయతీ కార్యదర్శి

ఇసుక, మొరం సహకార సంఘం ఎన్నికను రద్దు చేయాలని వినతి



తిమ్మంపేట(మంగపేట) న్యూస్‌టుడే: మండలంలోని తిమ్మంపేట పంచాయతీ పరిధిలో ముక్కిడి పోచమ్మ ఆదివాసీ ఇసుక, మొరం లేబర్ కాంట్రాక్టు సహకార సంఘం పాలక మండలిని రద్దు చేయాలని ఆ సంఘం సభ్యులు సోమవారం డీసీవో సర్దార్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ.. సహకార సంఘం సొసైటీలో 250 మంది సభ్యులున్నారని, అందరికీ సమాచారం ఇవ్వకుండా 10 మందితో ఎన్నిక నిర్వహించారన్నారు. మళ్లీ ఎన్నిక నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు కోడెం నారాయణ, చంద్రం, సనిల్‌కుమార్, మొగిళి, నరేష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

టేకు కలప పట్టివేత



వెంకటాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురం మండలం కొత్తగుంపు అభయారణ్యం పరిధిలో టేకు కలప దుంగలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విధి నిర్వహణలో భాగంగా కలిపాక సమీప అడవుల్లో పర్యటించిన యంత్రాంగానికి సోమవారం ఇక్కడి ఓ ప్రాంతంలో కలప దుంగలు ప్రత్యక్షమైనట్లు ఎఫ్‌బీవో మౌనిక తెలిపారు. సెక్షన్ అధికారి చంద్రమోహన్, బేస్ క్యాంపు బృందం ఆ నిల్వలను పరిశీలించి అడవినుంచి తీసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన ఏడు దుంగలను వెంకటాపురం అటవీ క్షేత్ర కార్యాలయానికి తరలించామని, విలువ రూ.2.17 లక్షలు ఉంటుందన్నారు. ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి రహస్యంగా కలప దుంగలను తీసుకొచ్చిన అక్రమార్కులు ఈ ప్రాంతంలో నిల్వ చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఎవరూ తీసుకొచ్చారు? ఎక్కడికి తరలించేందుకు నిల్వ చేశారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

డివైడర్ పైకి దూసుకెళ్లిన లారీ

వాజేడు, న్యూస్‌టుడే: జాతీయ రహదారిలో సోమవారం తెల్లవారుజామున జగన్నాథపురం వైజంక్షన్‌లోని డివైడర్‌పైకి లారీ దూసుకెళ్లింది. వేగంగా ఢీకొట్టడంతో గోడ ధ్వంసమైంది. జాతీయ రహదారిలో ఎదురుగా ఉన్న పశువులను తప్పించే బోయే క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. స్థానికుల సమాచారం మేరకు వాజేడు పోలీసులు డివైడర్‌పై నుంచి లారీని తొలగించారు.



చికిత్స పొందుతూ ఒకరి మృతి

దామెర, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన జగనం రమేష్(35) మానసిక స్థితి సరిగ్గా లేదు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు దామెర మండలం ఒగ్లాపూర్‌లోని సైలాని బాబా దర్గాకు సెప్టెంబరు 26న తీసుకొచ్చారు. అదే రోజు రాత్రి రమేష్ దర్గాలోని ఓ గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించగా చికిత్స కోసం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సెప్టెంబరు 29న మృతి చెందాడు. మృతుడి భార్య కౌసల్య ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



రమేష్ (పాతచిత్రం)

ఏడేళ్ల బాలికపై వృద్ధుడి అత్యాచారయత్నం

ఖానాపురం, న్యూస్‌టుడే: వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన 70 ఏళ్ల వృద్ధుడు ఆదివారం అత్యాచారయత్నం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను వృద్ధుడు సమీపంలోని పొలాలలోకి తీసుకెళ్లాడు. ఓ మహిళ దీన్ని గమనించి బాలిక కుటుంబ సభ్యులకు చెప్పడంతో వెలుగులోకి వచ్చింది. దుగ్గొండి సీఐ సాయిరమణ, ఎస్సై రఘుపతి సోమవారం గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. వృద్ధుడిపై అపహరణ, అత్యాచారయత్నం, పోక్సో కేసులు నమోదు చేసినట్లు సమాచారం

దుర్గంధాన్ని పారదోలారు..!



వ్యర్థాలు తొలగిస్తున్న పంచాయతీ కార్మికులు

ఈనాడు కథనానికి స్పందన

వెంకటాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల కూడలి ప్రాంతంలో దుర్గంధాన్ని అధికారులు పారదోలారు. ఈ నెల 30వ తేదీన ‘ఈనాడు’లో ‘వ్యర్థం.. దుర్గంధం’ అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి సోమవారం పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ స్పందించారు. తక్షణమే కార్మికులను ఏర్పాటు చేసి చెత్త నిల్వలను తొలగించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ ప్రాంతానికి తరలించారు. జనసంచారం అధికంగా ఉండే రోడ్డుపైనే వ్యర్థాలను పడేస్తున్న వారి వివరాలను సేకరించనున్నట్లు చెప్పారు. అదే క్రమంలో సంబంధిత శాఖల యంత్రాంగంతో చర్చించి నిల్వలను రహదారులపై వేయకుండా చర్యలు తీసుకోనున్నట్లు కార్యదర్శి వివరించారు.

కోనోకార్పస్ మొక్కలతో శ్వాసకోశ వ్యాధులు

ములుగు, న్యూస్‌టుడే: హరితహారంలో భాగంగా రహదారులకు ఇరువైపులా నాటినటువంటి కోనో కార్పస్ మొక్కలను వెంటనే తొలగించాలని భీజేవైఎం జిల్లా కార్యదర్శి రాయంచు నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మొక్కల వల్ల అలర్జీ, శ్వాసకోశ వ్యాధులు, అస్తమా, కిడ్నీల సమస్యలు తలెత్తుతాయన్నారు. పిల్లలు, వయసు మీద పడినటువంటి పెద్దలపై ఎక్కువగా ప్రభావం చూపుతాయని, ప్రభుత్వం గుర్తించి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలను ఆదేశించి వెంటనే తొలగించాలని పేర్కొన్నారు.

ఆకుకూరలు, చిరుధాన్యాల్లో పోషకాలు



తల్లులకు సూచనలిస్తున్న వైద్యాధికారిణి యమున

మల్లూరు (మంగపేట), న్యూస్‌టుడే: పిల్లలకు పోషక లోపం తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చుంచుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి యమున అన్నారు. సోమవారం మంగపేట మండలంలోని మల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషక లోపాలు (బరువు తక్కువ, ఇతర ఆరోగ్య సమస్యలు) కలిగిన పిల్లలకు యమున పర్యవేక్షణలో స్క్రీనింగ్ చేశారు. పోషక లోపాన్ని నివారించడం కోసం ఎలాంటి ఆహారం తీసుకోవాలో తల్లులకు వివరించారు. సకాలంలో ఆహారం ఇవ్వాలని, చిన్నారుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. ఆకుకూరలు, చిరుధాన్యాల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ శైలజ, ఏఎన్ఎం సీతమ్మ, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై గుంతలు.. వాహనదారులకు తిప్పలు

తాడ్వాయి(ములుగు జిల్లా), న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో రహదారుల అభివృద్ధి ఆశించినస్థాయిలో జరగడం లేదు. కనీసం మరమ్మతులకు సైతం నిధులు విడుదల చేయలేని దుస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే.. గత నెల 31న తాడ్వాయి మండలంలో కురిసిన భారీ వర్షాలకు వివిధ గ్రామాల్లోని చాలా రహదారులు దెబ్బతిన్నాయి. ఈ వరదలకు మండల కేంద్రానికి సమీపంలో తాడ్వాయి-ఏటూరునాగారం మధ్యలో జాతీయ రహదారి కోతకు గురవ్వడం, అక్కడక్కడ గోతులు ఏర్పడ్డాయి. దీంతో నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే వందలాది వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పర్యాటక జిల్లాగా గుర్తింపుపొందిన ఏటూరునాగారం ప్రాంతానికి రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. రోడ్లు సరిగ్గా లేకపోవడంతో అప్పుడప్పుడు ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారిని అంచనా వేయకుండా అధికవేగంతో ప్రయాణించే కార్లు, లారీలు సైతం ప్రమాదాలకు గురవుతున్నాయి. జిల్లా యంత్రాంగం స్పందించి మరమ్మతులు చేయాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సమస్యపై జాతీయ రహదారుల సహాయ ఇంజినీరు కుమారస్వామి ‘న్యూస్‌టుడే’ వివరణ కోరగా.. సమస్య ఉన్నది వాస్తవమేనన్నారు. రహదారి శాశ్వత అభివృద్ధి, తాత్కాలిక మరమ్మతుల కోసం ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు.



తాడ్వాయిలో ధ్వంసమైన జాతీయరహదారి

స్వచ్ఛంద సేవలకు పురస్కారం



వెంకటాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురం మండలానికి చెందిన చేయూత స్వచ్ఛంద సంస్థకు మరో పురస్కారం దక్కింది. గ్రామీణ పల్లెల్లో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా స్ఫూర్తి సొసైటీ ఇండియా, ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో పురస్కారాలను అందించినట్లు తెలిపారు. రక్తదాన శిబిరాలు, స్వచ్ఛత, సఖి సేవలు, చిన్నారులు, మహిళలు, గర్భిణుల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలను విరివిగా నిర్వహిస్తున్న చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్‌ను డాక్టరేట్‌తో సత్కరించారు. స్ఫూర్తి సంస్థ బాధ్యులు డాక్టర్ ఆకుల రమేశ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రంతో పాటు పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్న బట్టి విజయ్‌కు బ్లడ్ ఆర్గనైజర్, మోటివేటర్ అవార్డు అందించారు. పల్లె ప్రాంతాల్లో తమ సేవలను గుర్తించి పురస్కారాలు అందించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. పలువురు వీరిని అభినందించారు.

గ్రామస్థాయిలో సహాయకులను నియమించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులు

ములుగు, న్యూస్‌టుడే: డిజిటల్ క్రాప్ సర్వేను సమర్థవంతంగా నిర్వహించుకు గ్రామ స్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులకు సహాయకులను నియమించాలని వ్యవసాయ విస్తరణ అధికారుల ఐకాస ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పాలనాధికారి టీఎస్.దివాకరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని, ప్రతిష్ఠాత్మకమైన పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. పంటల సాగులో డిజిటల్ క్రాప్ సర్వే ప్రముఖ పాత్ర పోషించనున్నందని పేర్కొన్నారు. ఐకాస నాయకులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



మంగపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కస్తూరిబాయి మహిళా మండలి ఆధ్వర్యంలోని వృద్ధాశ్రమంలో సోమవారం వృద్ధులకు అన్నదానం చేశారు. కమలాపురం గ్రామానికి చెందిన సుంకరి మురళి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు అన్నదానం చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాతలు సుంకరి రంగరామకృష్ణ, కస్తూరిబాయి మహిళా మండలి అధ్యక్షురాలు కొమరగిరి సామ్రాజ్యం, వర్తక సంఘం అధ్యక్షుడు కొమరగిరి కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

వాజేడు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా మైదానంలో శ్రమదానం చేశారు. క్రీడా మైదానంలోని పిచ్చిమొక్కలు, పాఠశాల ఆవరణలోని వ్యర్థాలను తొలగించారు. విద్యార్థులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు శ్రమదానంలో పాల్గొన్నారు. పాఠశాలలో మాదిరిగానే నివాస పరిసరాలు ఉంచుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతికి కృషి



భాజపా సభ్యత్వ నమోదులో పార్టీ శ్రేణులు

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: ప్రపంచంలో భారతదేశాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు భాజపా విశ్వప్రయత్నం చేస్తుందని భాజపా నాయకుడు, పార్టీ మాజీ మండలాధ్యక్షుడు మద్దినేని తేజరాజు అన్నారు. గోవిందరావుపేట మండలం మచ్చాపూర్ గ్రామంలో సోమవారం లక్నవరం శక్తి కేంద్రంలోని 100వ బూత్ అధ్యక్షుడు నీరటికుమార్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు బూరుగుల చంద్రమౌళి ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో అన్ని వర్గాల సమ్మిళిత అభివృద్ధికి భాజపా కట్టుబడి ఉందన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భాజపా శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన కేయూ ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంటు



బహుమతి అందజేస్తున్న కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ వెంకయ్య

ముచ్చర్ల (హసన్‌పర్తి), న్యూస్‌టుడే: హనుమకొండ హసన్‌పర్తి మండలం భీమారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న కేయూ ఇంటర్-కాలేజియేట్ పురుషుల టోర్నమెంటు (ఫేజ్-1) సోమవారం ముగిశాయి. జిల్లా యువజన, క్రీడశాఖ అధికారి జి.అశోక్ విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. యువత తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు క్రీడలపై దృష్టి పెట్టాలని సూచించారు. గెలుపు, ఓటములు సహజమని, గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గౌరవ అతిథి కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొ. వై.వెంకయ్య మాట్లాడుతూ కాకతీయ విశ్వ విద్యాలయం పరిధిలోని ఆదిలాబాద్, ఖమ్మం, ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచి 34 కళాశాలలకు చెందిన 800 మంది క్రీడాకారులు టోర్నమెంట్‌లో పాల్గొనడం అభినందనీయమన్నారు.

బాల సదనంలోని బాలికలకు అన్నిరకాల సౌకర్యాలు



బాలికలతో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, అధికారులు

ములుగు టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో విద్యకు దూరమవుతున్న బాలకలను గుర్తించి బాలసదనంలో చేర్పించాలని అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అన్నారు. బాల సదనంలో సోమవారం జిల్లా తనిఖీ కమిటీ ఆధ్వర్యంలో బాలలకు అందుతున్న సౌకర్యాలపై నిర్వహించిన సమీక్షలో అదనపు కలెక్టర్ మాట్లాడారు. బాలికలకు పౌష్టికాహారం అందించాలని, బాల సదనంలోని బాలికలకు ప్రభుత్వం అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్ మాట్లాడుతూ.. జిల్లాలోని రక్షణ, ఆదరణ కావాల్సిన బాలికలను గుర్తించి బాల సదనంలో వసతి, విద్య, రక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం కమిటీ సభ్యులతో కలిసి బాలల అభివృద్ధి, వైద్య నివేదికలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సైకియాట్రిస్టు నమ్రత, సభ్యులు నాగరాజు, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

యూఏఈలో ఉద్యోగ అవకాశాలు

కొత్తవాడ, న్యూస్‌టుడే: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్), రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ సంస్థ యూఏఈలో బైక్ రైడర్స్ ఉద్యోగాలు ఉన్నాయని వరంగల్ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. యూఏఈ(దుబాయ్)లో డెలివరీ బాయ్స్ ఉద్యోగాలకు టామ్‌కామ్ పోర్టల్‌లో ఈ నెల 5లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనం లైసెన్స్, 21 ఏళ్లు నిండిన యువకులు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 94400 51285 సంప్రదించాలన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, బాలల పరిరక్షణ సిబ్బంది

ములుగు టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు నేర్చుకోవాలని ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరెడ్డి విద్యార్థులకు సూచించారు. ములుగు మండలం మల్లంపల్లి ప్రభుత్వ పాఠశాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలాంటి సమస్యలున్నా చైల్డ్‌లైన్ టోల్‌ఫ్రీ నెంబరు 1098కు ఫోన్ చేయాలన్నారు. సోషల్ వర్కర్ జ్యోతి బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలలపై లైంగిక వేధింపులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ నాగరాణి, జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ శ్రవంతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధిపై దృష్టి సారించండి



సూచనలు చేస్తున్న మోహన్

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: మహిళలు స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించి ఆర్థికంగా స్థిరపడాలని కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వశాఖ సలహాదారు డా.పోలెపాక మోహన్ సూచించారు. సోమవారం 36వ డివిజన్ చింతల్‌లో ఆడెపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి మహిళా పోషకాహారాన్ని స్వయంగా తయారు చేసి కుటుంబానికి వడ్డిస్తుందని, అలాంటి స్ఫూర్తి కలిగినవారు ఆహార శుద్ధి రంగంలోకి ప్రవేశిస్తే సామాజిక ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. ఆహార శుద్ధి రంగంలో అనుసరించాల్సిన మెలకువలు వివరించారు. అనంతరం ఆదర్శ మహిళా సంఘాల సభ్యులు, వైద్యులను ఫౌండేషన్ ఛైర్మన్ వెంకటేష్ సన్మానించారు.

కేటీపీపీ ఇన్‌ఛార్జి సీఈగా కోటేశ్వర్‌రావు

చెల్పూర్(గణపురం), న్యూస్‌టుడే : కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ ఇన్‌ఛార్జి సీఈగా ఐవీఎల్ కోటేశ్వర్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సీఈగా పనిచేసిన సిద్దయ్య సోమవారం పదవీ విరమణ పొందగా ఆయన స్థానంలో 500 మెగావాట్ల మొదటి యూనిట్‌లో సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న కోటేశ్వర్‌రావు సీఈగా బాధ్యతలు చేపట్టారు.